


కథ

బి.ఆర్.కె.వి.భాస్కరరావు

# ఒక ఐడియా

ఉమాపతి హాల్లో ఉన్న సోఫాలో కూర్చుని తలను వెనక్కివాల్చి నొసలు నొక్కుకుంటున్నాడు. బెడ్రూమ్‌లో టి.వి. ఆన్ చేసే ఉంది. ఆఫీసునుంచి వచ్చి అప్పటికే పావుగంట అయినా కనీసం మంచినీళ్ళు కూడా ఇవ్వని భార్యపై చచ్చేంత కోపం వచ్చింది. అది రోజూ వచ్చే కోపం కావడంతో అలవాటు ప్రకారం పంటి బిగువునే ఆపుకున్నాడు.

''ఇదిగో మంచినీళ్ళు'' అని భార్య పిలిచేస రికి-

తలెత్తి భార్య చేతిలోని మంచినీళ్ళ గ్లాసందు కొని గడగడ తాగేసాడు.

''మా తమ్ముడు జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు వస్తు న్నాడు. విజయవాడలో ట్రైన్ ఎక్కిన వెంటనే ఫోన్ చేశాడు. కొంచెం స్టేషన్‌కు వెళ్ళి వాణ్ణి తీసుకు రండి''

''మీ తమ్ముడికి హైదరాబాద్‌లో పనేంటో?!'' గ్లాసు కిందపెడ్తూ అడిగాడు.

''ఏదో ఇంటర్వ్యూ ఉందట'' బెడ్రూమ్‌లోకి వెళ్తూ చెప్పింది.

''రమా! మళ్ళీ వెళ్ళిపోతున్నావేంటి?''

''యాడ్‌లు అయిపోయాయి. సీరియల్ వచ్చే స్తోంది'' వెనక్కి తిరక్కుండానే సమాధానం చెప్పింది రమ.

''ఖర్మరా బాబూ! ఆఫీసునుంచి వచ్చిన భర్తకు కనీసం కాఫీ అయినా ఇవ్వకుండా చేసే టి.వి.సీరి యల్స్ వాళ్ళని కనిపిస్తే కాల్చివేయాలి'' అని అను కుంటూ బయటకు వచ్చి-

''రమా నేను వెళ్తున్నా తలుపు గడియ వేసుకో'' అని గట్టిగా అరిచాడు.

''మీరు దగ్గరగా వేసి వెళ్ళండి. మళ్ళీ యాడ్‌లు వచ్చినప్పుడు లేచి గడియపెడ్తాను'' అంది రమ లోపల్నుంచే.

పీకపిసికి వేయాలన్నంత కోపం వచ్చింది. ఆ కోపాన్ని తలుపులపై చూపిస్తూ దఢేల్న వేసాడు ఉమాపతి.

★ ★ ★

''ఎలా ఉన్నావు కృష్ణా'' ట్రైన్ దిగిన బావమర్ది చేతిలోని బ్యాగ్‌నందుకుంటూ అడిగాడు ఉమా పతి.

''బాగానే ఉన్నాను. మరి మీరు?!''

''ఇదిగో ఇలా తగలడ్డా!''

ఎప్పుడూ నవ్వుతూ ఆప్యాయంగా పలుకరించే బావగారు ఒక్కసారిగా ఇలా ఎందుకు మాట్లా డారో అర్థంకాని కృష్ణ మౌనంగానే వచ్చి ఉమాపతి వెనుక బైక్ మీద కూర్చున్నాడు.

పావుగంటకు ఇద్దరూ ఇల్లు చేరారు. దార్లో ఏవో పొడి పొడిగా మాట్లాడుకున్నారే తప్ప మన స్ఫూర్తిగా మాట్లాడుకోలేదు.

''అక్కా, అక్కా'' అంటూ కృష్ణ బండిదిగి తలుపు కొట్టేసరికి రమ వచ్చి తలుపుతీసి ''రారా తమ్ముూ!'' అంటూ ఇంతమొహం చేసుకుని కృష్ణ చేతిలోని బ్యాగ్ తీసుకుంది.

లోపలకు వచ్చి సోఫాలో చతికిలబడ్డ కృష్ణ బెడ్రూమ్ వైపు చూస్తూ ''లోపలెవరయినా ఉన్నారా! టివి ఆన్ చేసి ఉంది'' అని అడిగాడు.

''ఇంకెవరు ఉంటారు నేనే. ఇంకో విషయం తెలుసా? నువ్వొచ్చేటైంకి పిచ్చి..పిచ్చి..పిచ్చి సీరి యల్ ఎపిసోడ్ ఎండ్ అయ్యింది. ఆ గేప్‌లో...''

''నువ్వు రావడంవల్ల పలకరింపు వెంటనే జరి గింది. లేకపోతే నెక్స్ట్ ఎపిసోడ్ గేప్ వరకు ఆగా ల్సిందే'' అంటూ రమ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ చెప్పి విసవిస బెడ్రూమ్‌లోకి వెళ్ళిపో యాడు ఉమాపతి.

ఉమాపతి వెళ్ళిన వైపు ఓ నిమిషం కోపంగా చూసి, తిరిగి కృష్ణవైపు చూస్తూ ''ఆయనంతే లేరా! నువ్వెళ్ళి స్నానం చేసిరా! భోజనం పెడ్తాను. ఈ లోపుగా వార్తలూ అవుతాయి. తీరిగ్గా టి.వి. చూస్తూ మాట్లాడుకోవచ్చు'' అంటూ వంటిం ట్లోకి వెళ్ళిపోయింది.

రమ పరిస్థితి అర్థంకాని కృష్ణ స్నానం చేసి వచ్చే సరికి డైనింగ్ టేబుల్ దగ్గర ఉమాపతి ఒక్కడే కూర్చుని ఉన్నాడు.

''బావగారూ! అక్కేది?'' కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

''వస్తుంది కంగారుపడకు. తాను చూసే ఛానె ల్‌లో న్యూస్ వస్తోంది. అందుకే వేరే ఛానెల్‌లో 'నెత్తిమీద గుడ్డ' అనే సీరియల్ వస్తోంది. యాడ్‌ల కోసం ఇచ్చే గేప్‌లో వచ్చి మనకు అన్నం వడ్డి స్తుంది''

''మరి ఆకలేస్తే..''

''త్వరగా యాడ్స్ రావాలని కోరుకో''

''ఏంటి మీ బావగారు లెక్చర్లిస్తున్నారు నామీ దనా?'' అంటూ డైనింగ్‌టేబుల్ దగ్గరకు వచ్చింది రమ.

''ఆ, ఏమీ లేదు. నువ్వు చూసే టీవీ సీరి యల్స్ గురించి చెప్తున్నారు'' ఒక్కసారిగా రమ ముఖంలో రంగు మారిపోయి ఉమాపతి వైపు చూస్తూ ''ఈయనెప్పుడు నేను చూసే టీవీ సీరి యళ్ళ గురించే చెప్పుకుని అఘోరిస్తారు. ఉదయం వెళ్ళి సాయంత్రం వరకు రారు. ఈ లోపుగా నేను చేసే పనేముంది. అందుకే చూస్తున్నాను. ఈ మాత్రం దానికే నీకు చెప్పాలా?'' అంది కళ్ళు పెద్దవి చేస్తూ.

కృష్ణ మారు మాట్లాడలేదు.

ఇద్దరి కంచాల్లో అన్నం, కూర వడ్డించి ఎవరో పిలిచినట్టు ''కూర, అన్నం తింటూ ఉండు తమ్ముి, ఇప్పుడే వచ్చేస్తా'' అంటూ మరలా టీవీ ముందుకు వెళ్ళిపోయింది రమ.

ఉమాపతివైపు జాలిగా చూసాడు కృష్ణ.

కొన్ని నిమిషాలు గడిచాక ''బావగారూ! మరల అక్క ఎప్పుడు వస్తుంది''

''యాడ్‌లు వచ్చినప్పుడు''

''ఈ లోపు కూర అన్నం అయిపోతే?''

''నీకు అలవాటు లేకపోవడంవల్ల అయిపో తుంది. నాకయితే కరెక్టుగా టైము సరిపోతుంది'' అన్నాడు.

ఉమాపతి చెప్పినట్టే రమ వచ్చి అన్నం వడ్డిం చింది.

రాత్రి ప్రొద్దుపోయేవరకు బావా బావమర్దులి ద్దరూ అవి ఇవి కబుర్లు చెప్పుకున్నారు. రమ మాత్రం టీవీ వదలి బయటకు రాలేదు.

''బావగారూ! పదకొండయ్యింది. నేను పడుకుంటాను. మీరు పడుకోండి'' అన్నాడు.

''అలాగే! నేనూ ఓ అరగంటపోయాక పడుకుంటాను''

''మీకు నిద్ర రావడం లేదా?''

''ఎందుకు రావడం లేదు? భేషుగ్గా వస్తోంది. కాకపోతే పదకొండు నుంచి ఓ అరగంటపాటు 'చచ్చిపోకే పిచ్చితల్లి' అనే ఓ ఏడ్పుగొట్టు సీరియల్ వస్తుంది. అది చూసి మీ అక్క కళ్ళు ఉబ్బేలా ఏడ్చి ఏడ్చి అలానే పడుకుంటుంది. ఆపైన నేను వెళ్ళి టీవీ కట్టేసి పడుకుంటాను.''

''రోజూ ఇదే తంతా? ఓ ఆప్యాయతా, ముద్దూ ముచ్చటా లేదా?''

''ఆయనుంటే గుండెందుకు అన్నట్టు ఆ ముద్దుముచ్చట ఉంటే పెళ్ళయి పదేళ్ళయినా పిల్లలు పుట్టకుండా ఉంటారా?''

కృష్ణ నిట్టూరుస్తూ బావగారు సిద్ధం చేసి ఉంచిన తన మంచం మీద వాలిపోయాడు.

★ ★ ★


ఉదయం కృష్ణ లేచేసరికి రమ వంట చేస్తోంది. అప్పటికే ఉమాపతి రెడీ అయి ఉన్నాడు.

''బావగారూ! ఉదయం సమయంలో అక్క టీవీ చూడదా?'' బావగారి చెవిలో గుసగుసలాడాడు కృష్ణ.

''చూడదు కాబట్టే నన్నింకా గుర్తుపడుతున్నావు. నా పుణ్యమాని వాళ్ళు ఇంతవరకు ఉదయం పూట సీరియల్స్ స్టార్ట్ చెయ్యలేదు. చేసారో నన్ను నువ్వు గుర్తుపట్టలేవు. ఎందుకంటే అస్థిపంజరంగా మారిపోయి వుంటాను''

కృష్ణ మారు మాట్లాడకుండా తానూ రెడీ అయి టిఫిన్ తినేసి ఇంట్లోంచి బయటపడ్డాడు.

మధ్యాహ్నం ఒంటిగంట అవుతుండగా కృష్ణ ఇంటికి వచ్చాడు.



సోఫాలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్న రమవైపు ఆశ్చర్యంగా చూస్తూ ''అక్కా, ఈ టైంలో నువ్విక్కడ..''

సర్వస్వం కోల్పోయిన దాన్లా ముఖం పెట్టి ''ఏం చెయ్యన్రా. గంట నుంచి టీవీలో ఏ ఛానలూ వచ్చి ఛావడం లేదు'' అంది.

''పక్కింటి వాళ్ళ టివిలు వస్తున్నాయా?''

''అవి కూడా తగలడ్డం లేదు. ఇప్పుడే కేబుల్ ఆఫీసుకు ఫోన్ చేసాను. ఈ పక్క కేబుల్‌లో ఏదో ఫాల్ట్ ఉందట. అందువల్ల రిపేరు పూర్తయితేకానీ ఇవ్వలేం అన్నార్రా''

''అలా అన్నారా! ఈసారి వాళ్ళు మంత్లీ బిల్లుకు వచ్చినప్పుడు ఏవో సాకులు చెప్పి నాలుగైదుసార్లు తిప్పించు. వాళ్ళ తిక్క కుదురుతుంది'' అని సలహా ఇచ్చాడు కృష్ణ.

''నిజమేరా అలాగే చేస్తాను. సరేకాని నువ్వెళ్ళి కాళ్ళు కడుక్కునిరా భోజనం చేద్దువుగాని'' అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళింది రమ.

''అమ్మా, నాన్నా ఎలా ఉన్నార్రా'' మొట్ట మొదటిసారిగా పుట్టింటి విశేషాలు అడిగింది రమ, కృష్ణకు అన్నం వడ్డిస్తూ.

''బాగానే ఉన్నారు. కానీ నాన్నకే ఈమధ్య ఒంట్లో బొత్తిగా బాగోవడం లేదు. నిన్ను చూడాలని చాలాసార్లు అన్నాడు'' అనేసరికి - రమ కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

''నిజమేరా! నేనూ నాన్నని చూసి చాలాకాలం అయ్యింది'' అంటూ చిన్నప్పటి జ్ఞాపకాల్ని చాలాసేపు నెమరు

వేసుకున్నారు.

డైనింగ్ టేబుల్ దగ్గర్నుంచి ఇద్దరూ లేచి వచ్చి సోఫాలో కూర్చుని చాలాసేపటివరకు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. వారి మాటల మధ్యలో లేచి వెళ్ళి టివి వస్తోందో లేదో చూసి వచ్చేది రమ.

సాయంత్రం నాలుగయ్యేసరికి రమ లేచి ''మీ బావగారు వచ్చే టైం అయ్యింది. ఏదైనా టిఫిన్ చేస్తాను'' అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

ఓ అరగంటకు వచ్చిన ఉమాపతి ఎప్పుడు వచ్చి తలుపు తీస్తుందో తెలియక తలుపును పట్టుకుని వేలాడుతూ ఉండటం అలవాటయిపోయి ఈరోజు తలుపు తీసి ఉండటంతో ఒకింత ఆశ్చర్యాన్నిలోనవుతూ లోపలకు వచ్చాడు.

ఎదురుగా కృష్ణ, రమలు కూర్చుని మాట్లాడుకోవడంతో మరింత నివ్వెరపోయి వెనక్కి తిరిగ బోయేసరికి-

''బావగారూ! మరలా ఎక్కడికి వెళ్తున్నారు?'' అని కృష్ణ వెనుక నుండి పిలిచాడు.

ఉమాపతి వెనక్కి తిరిగి ''సారీ! ఇది మా యిల్లనుకుని వచ్చేసాను'' అన్నాడు.

''వేళాకోళం ఆపి లోపలకు రండి. విడ్డూరం కాకపోతే మేం ఇద్దరం గుండ్రాయిల్లా కన్పిస్తున్నాంగా'' అంది రమ నవ్వుతూ.

''కర్మే అనుకో! కానీ నువ్వు ఈ టైంలో ఇక్కడ'' అని నసుగుతూ లోపలకు వచ్చాడు.

''ఏం చేస్తాను? మీ దృష్టే తగిలింది టీవీకి. కేబుల్‌లో ఏదో ఫాల్ట్ వుందట. రిపేరు చేస్తే కానీ టీవీ రాదట'' అంది దీనంగా.

ఉమాపతి మనసు సంతోషంతో ఉప్పొంగిపోతోంది. కానీ అది బయట పడనీయక ''అయ్యోపాపం'' అంటూ తానూ కూర్చున్నాడు.

''మీరెళ్ళి కాస్తంత ఫ్రెష్ అయి రండి. పకోడీలు చేసాను. వేడివేడిగా ఉన్నాయి. అందరూ కలిసి తిందాం'' అని రమ అనిన వెంటనే చిన్నపిల్లాడిలా పది నిమిషాల్లో వచ్చేసాడు ఉమాపతి.

పకోడీలు తింటూ 'కేబుల్ రిపేరు మరో పదిరోజులు పట్టేలా చూడు భగవంతుడా' అనుకున్నాడు మనసులో ఉమాపతి.

ఆ రాత్రి ముగ్గురూ కలిసి వెళ్ళి ఓ హోటల్‌లో భోజనం చేసి వచ్చారు. కృష్ణ పదయ్యేసరికి పడుకున్నాడు.

చాలాసేపటి వరకు రమ టివి వస్తుందేమోనని ఎదురుచూసి ఉమాపతి ప్రక్కనే నడుం వాల్చింది. చాలాకాలం తర్వాత ఉమాపతి రమ నడుంపై చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నాడు. రమ వారించలేదు. రెట్టింపు ఆనందంతో రమకు మరచిపోయిన రుచుల్ని గుర్తుకు తెచ్చాడు ఉమాపతి. ఇద్దరూ చాలాసేపు మేల్కొనే ఉన్నారు.

మరునాటి ఉదయమే కృష్ణ పనుందని బయటకు వెళ్ళిపోయాడు. ఆ రోజు కూడా టీవీ రాలేదు. కానీ రమ క్రితం రోజు పడినంత బాధపడలేదు. ఉమాపతి రమల మధ్యలో మాటలు పెరిగాయి. వాళ్ళల్లో మార్పు గమనించాడు కృష్ణ.

ఆ సాయంత్రం కృష్ణను సాగనపండాన్కి స్టేషన్‌కు వచ్చిన ఉమాపతి చేతిలో కృష్ణ ఓ కవరు పెట్టి ''బావగారూ! దీన్ని ఇంటికి వెళ్ళాక ఒంటరిగా చదువుకోండి. అక్కకు మాత్రం చూపించవద్దు'' అన్నాడు.

''అలాగే''నని జేబులో కవరుంచుకున్నాడు ఉమాపతి.


ఇంటికి వచ్చిన ఉమాపతి రమ వంటింట్లో ఉండటం చూసి స్టేషన్లో కృష్ణ ఇచ్చిన కవరు విప్పి చదవసాగాడు.

''బావగారూ! మా అక్క టీవీ పట్ల చూపించే ప్రేమలో సగం మీ పట్ల చూపకపోయినా మీరు ఏమాత్రం బాధపడకుండా నవ్వుతూ స్వీకరించడం చూసి నేను చలించిపోయాను.

మా అక్క మిమ్మల్ని నిరాదరించినా మీరు మాత్రం ప్రేమతోనే చూసుకోవడం చూసి నేను ఓ పథకం వేసాను. కేబుల్ టివి వాళ్ళ ఆఫీసుకు వెళ్ళి నేనే టీవీలు రాకుండా చేసాను. అతికష్టం మీద వాళ్ళు ఐదు వేల రూపాయలు ఇస్తానంటే ఒప్పుకున్నారు. నా పథకం పారింది. మళ్ళీ మీ మధ్య ప్రేమ అంకురించింది. దయుంచి మీరు ఏమీ అనుకోకుండా వాళ్ళకి ఎమౌంట్ పే చేయండి. జాగ్రత్త బావగారూ! మళ్ళీ టీవీలో సీరియల్స్ వచ్చేస్తాయి. అక్కను జాగ్రత్తగా చూసుకోండి. మరలా దారి తప్పకుండా చూసే బాధ్యత మీదే..ఉంటాను

- మీ బావమరిది కృష్ణ''

బావమరిదికి మనసులోనే థాంక్స్ చెప్పుకుంటూ నవ్వుకున్నాడు ఉమాపతి.



## మళ్లీ సల్మాన్-ఐష్?

**అప్పుడెప్పుడో 'హమ్ దిల్ దే చుకే సనమ్' సినిమాలో కలిసి నటించారు ఐశ్వర్యారాయ్-సల్మాన్ ఖాన్. ఆ తర్వాత ఇద్దరూ మరో సినిమాలో నటించలేదు. పెళ్లివరకూ వచ్చిన ఇద్దరి ప్రేమకథా ఎంతగా పాపులర్ అయిందో అందరికీ తెలుసు. అభిషేక్-ఐశ్వర్యల వివాహానికి సల్మాన్ హాజరుకాని సంగతి కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లకి తిరిగి ఇద్దరూ కలిసి నటించే చాన్సు వచ్చింది అంటున్నారు. రచయిత జావేద్ అఖ్తర్ నిర్మించే 'అజబ్ హై ఇష్క్' సినిమాలో ఇద్దరూ జంటగా నటిస్తారని వార్త. నిప్పులేనిదే పొగరాదు కదా!**